మురుగునీటికి దారేది..?

- బాన్సువాడ పట్టణంలో అధ్వానంగా కొత్తకాలనీలు
- రోడ్లపై, ఓపెన్‌ప్లాట్లలో మురికినీటితో ప్రజల అవస్థలు



పట్టణంలోని చైతన్యకాలనీలో ఓపెన్ ప్లాట్లలో నిలిచిన మురికినీరు

బాన్సువాడ : పట్టణంలోని కొత్త కాలనీల ఏర్పాటుశరవేగంగా జరుగుతున్నప్పటికీ ఆయా కాలనీల్లో సౌకర్యాలు ఆదేస్థాయిలో జరగట్లేదు. దీంతో కొత్తగా ఏర్పడ్డ కాలనీల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగునీరు వెళ్లేందుకు దారిలేక రోడ్లపైనే నీళ్లు నిలుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారంరోజుల క్రితం కురిసిన వర్షాలు కురిసి వారరోజులైనప్పటికీ ఇప్పటికీ రోడ్లపై, ఓపెన్ ప్లాట్లలో మురికినీళ్లు నిలుస్తుండడంతో దోమలు పెరిగి రోగాలబారిన పడుతున్నామని వారంటున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తగా ఏర్పడిన చైతన్యకాలనీ, సాయికృపా కాలనీ, వాసవీకాలనీ, హర్షత్‌కాలనీ, బీసీ కాలనీ, ఎన్‌జీవోఎస్ తదితర కాలనీలు జలమయం అవుతున్నాయి. ఇవి లోతట్టు ప్రాంతంలో కొన్నిచోట్ల డ్రెయినేజీలు నిర్మించినప్పటికీ ఎత్తువంపుల కారణంగా రోడ్లపై మురికినీరు నిల్వ ఉంటుంది. చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ బురదగా మారి ఈ రోడ్లపై వెళ్లాలంటే కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ప్రధాన కాలనీల్లో..

గతేడాది సాయికృపానగర్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ముందు నుంచి వేళ్లే రోడ్లపై మురికినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటుందని సమస్యను కౌన్సిలర్ రమాదేవి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను తీసుకెళ్లి సమస్యను వివరించారు. కానీ నేటి వరకు ఈ సమస్య పరిష్కారం కాలేదు. డ్రెయినేజీ డిజైన్ లెవల్స్ రూపొందించడంలో ఇంజనీరింగ్ విభాగం విఫలమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నిర్మాణ పనులు జరిగే సమయంలోనాణ్యత ప్రమాణాలు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అయితే కొత్త కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపై నిలిచిన నీటి నిల్వపై అధికారులు ఎలాంటి సర్వే చేపట్టడడం లేదు. ఏటా వర్షాకాలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది. తాత్కాలిక చర్యల పేరుతో రూ. లక్షలు ఖర్చు చేస్తున్నారని కాలనీవాసులంటున్నారు. దీంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని వారంటున్నారు. వర్షం నీరు ఏవిధంగా తగ్గించాలనే విషయంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. కొత్తగా వెలిసిన వెంచర్లలో రియల్ వ్యాపారులు సైతం డ్రెయినేజీలు, రోడ్లు లేకుండానే ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారే తప్ప కొనుగోలుదార్ల గురించి ఆలోచించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

యువత అన్ని రంగాల్లో రాణించాలి



కామారెడ్డి టౌన్ : యువత అన్ని రంగాల్లో రాణించాలని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. సూర్య ఆరోగ్య సంస్థ, ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాందీపని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక రంగంలో పరిశోధనలు చేయడంలో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో హరిస్మరణ్‌రెడ్డి, డైరెక్టర్ బాలాజీరావు, ప్రిన్సిపాల్ సాయిబాబా, ఐఎస్‌ఆర్‌డి సంస్థ అధ్యక్షులు సోలంకి రవళి, సీఈవో అమృత తదితరులున్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి టౌన్ : అఖిల భారత విద్యార్థి సమైఖ్య(ఏఐఎస్‌ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయం ముందు జిల్లా కన్వీనర్ శివప్రసాద్ జెండాను ఆవిష్కరించారు.నాయకులు రణధీర్, సంపత్, జస్వంత్, శ్రీనివాస్, వెంకటేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలి



రాజంపేట : గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాను సిద్ధం చేసుకోవాలని మండల ఎంపీడీవో రాజేశం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పోలింగ్ స్టేషన్ ల వారిగా ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఏపీవో సక్కుబాయి పాల్గొన్నారు.

రంగనాథన్‌కు నివాళులు



కామారెడ్డి అర్బన్ : గ్రంథాయల పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కే.విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కే.కిష్టయ్య, లైబ్రేరియన్ ఏ.లక్ష్మణాచారి, అధ్యాపకులు తదితరులున్నారు.

హర్‌ఘర్ తిరంగా ప్రతిజ్ఞ



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, హెచ్ఎం దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



రాజంపేట : తపాలా శాఖ అందిస్తున్న పథకాలను, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ అన్నారు. సోమవారం రాజంపేట మండలంలోని బస్వన్నపల్లిలో తపాలా శాఖ అందిస్తున్న పథకాలు, ఇన్సూరెన్స్, ఇతర సేవలపై డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి తపాలా శాఖ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాజంపేట ఎస్‌పీఎం భిక్షపతి, ఎంవో వెంకట్రెడ్డి, స్థానిక ఏపీఎం తదితరులున్నారు.

బస్టాండ్ల నిర్మాణం కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజనీర్ అజ్రత్‌రెడ్డి

భిక్కనూరు : మండలంలోని సిద్దరామేశ్వరనగర్ శివారులో జాతీయ రహదారిపై రెండు వైపులా బస్టాండ్ల నిర్మాణం కోసం, ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు గురించి అవసరమైన స్థలంను నేషనల్ హైవే రీజియన్ ఇంజినీర్ ఆజ్రత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. స్థానికి బీజేపీ నేతలు సిద్దరామేశ్వరనగర్ గ్రామానికి జాతీయ రహదారిపై బస్‌స్టాండ్ లేకపోవడం జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే దారి వద్ద హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో ఏర్పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఈ విషయాన్ని ఎన్‌హెచ్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నేషనల్‌హైవే రీజియనల్ ఇంజనీర్ ఆజ్రత్‌రెడ్డి వచ్చి బస్‌స్టాండ్‌ల నిర్మాణం కోసం ఫ్లడ్ లైట్ల ఏర్పాటు కోసం అవసరమైన స్థలంను ఆయన పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ నేతలు బత్తుల ఆనంద్, బోనాల హరింద్ర, పెంద్యాల నవీన్, పుట్నాల నవీన్, బత్తుల సాయిప్రసాద్, బోనాల తరుణ్‌లు ఉన్నారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఉరుదొండ వనిత రవిని సోమవారం దేవునిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూలబోకెతో సన్మానించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీడిసి అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్న గారి రాజు పటేల్, వీడీసీ ప్రతినిధులు గూడెల్లి గంగారం, నీలం రాజలింగం, ద్యావరి నర్సింలు, వంగ రాహుల్ కుమార్ తదితరులున్నారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కోసం మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియకు సోమవారం వినతిపత్రం సమర్పించినట్లు పాఠశాల హెచ్ఎం గంగాకిషన్ తెలిపారు. చైర్‌పర్సన్ ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జంగం శ్రీశైలం ఉన్నారు.

భూకబ్జాలను అరికట్టాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ : భూకబ్జాలను అరికట్టాలని సోమవారం ఆర్డీవో రమేశ్ రాథోడ్‌కు బీజేపీ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కల్కి చెరువు సమీపంలో హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. బాన్సువాడ పెద్దపూల వాగును కబ్జా గురికావడంతో విచారణ చేపట్టాలన్నారు. బాన్సువాడ పట్టణంలోని 10 శాతం భూములు ఆక్రమణలకు గురయ్యాయని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ అధ్యక్షులు శివ ప్రసాద్, నాయకలు భాస్కర్ రెడ్డి, కోనాల గంగారెడ్డి, గంగారాం, శంకర్, చిరంజీవి తదితరులున్నారు.

పోలీసులకు రాఖీలు



బీబీపేట : ప్రజాపిత బ్రహ్మకుమారీలు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు, ఎస్సై ప్రభాకర్, జీపీ కార్యదర్శి రమేశ్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, సిబ్బందికి రాఖీ కడుతూ ప్రతిఒక్కరికి మిఠాయిలను తినిపించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఇన్‌చార్జి జయా దీదీ, గంగాదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ అన్నారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీఎం రవీందర్, పర్యవేక్షణ అధికారి నగేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



పిట్లంలో దళితులకు బోరు మోటార్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన బోరు మోటార్లు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, మోహన్ రెడ్డి, సూరత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, షేక్ నజీర్ తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులో పంపిణీ చేస్తున్న మొక్కలను ఇళ్లముందు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ కోరారు. సోమవారం 9వ వార్డు లింగాపూర్‌లో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటా మొక్కలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుగుణ, అధికారులు, ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

చెరువు శిఖం కబ్జాపై ఫిర్యాదు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ శివారులోని కొత్త చెరువు శికం భూముల కబ్జాలను అరికట్టాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదలశాఖ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం భూములు కబ్జాలకు గురికావడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నారు. చెరువు శిఖం భూముల కబ్జాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఆధ్యాత్మికం

నీలకంఠేశ్వరాలయంలో అన్నపూజ



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నీలకంఠేశ్వరాలయంలో సోమవారం అన్నపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసంలోని సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన భక్తులు ముత్తి వీరప్ప, రామప్ప, ప్రవీణ్ దంపతులు స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం అన్నపూజ నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో భరత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని సంతాయిపేట్ శివారులో ఉన్న భీమేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వాగులో పవిత్ర స్నానాలు చేశారు. శివలింగానికి పాలాభిషేకం, జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, పూజారి రాజు పంతులు తదితరులున్నారు.

శివాలయాల్లో అన్నదానం



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సలాబత్‌పూర్, మద్నూర్‌లోని శివాలయాల్లో సోమవారం శ్రావణ మాసం సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కోడిచిర గ్రామ శివారులోని చెన్నమ్మకోరి ఆలయంలో సోమవారం శ్రావణ మాసం సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయంలోని శివలింగానికి వివిధ రకాల పువ్వులను అర్పించారు.

విశ్వనాథేశ్వర స్వామికి విశేష పూజలు



కామారెడ్డి అర్బన్ : శ్రావణ సోమవారం సందర్భంగా స్థానిక వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, విశేష అర్చనలు, అలంకరణ సేవలను వేద పండితులు గంగవరం అంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎ.లింగాగౌడ్, అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రతినిధులు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎ.నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మృతులకు నివాళులు అర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమరులైన సమగ్ర శిక్ష ఉద్యోగులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కామారెడ్డి మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి మండల విద్యావనరుల కేంద్రంలో చనిపోయిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, 61 ఏళ్ల దాటిన తర్వాత ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీఆర్పీలు చిరంజీవి, వెంకటేష్, రాములు, మాధవి, కవిత, కాళిదాసు తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : సమగ్ర శిక్షలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన నలుగురు సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు స్వప్న, శ్యామల, రాజు, గంగాధర్, విజయ్, సంజీవ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు తమ పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ ఎంపీడీవో కమలాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డామన్నారు. వచ్చే 15వ ఫైనాన్స్ నిధులు లేదా ఎస్ఎఫ్‌సీ నిధుల నుంచి తమకు వచ్చే పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆస్పత్రిలో వైద్యసేవలు కరువు



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదని సోమవారం మద్నూర్‌కు చెందిన యువకులు తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యువకులు ఆస్పత్రిలోని పరిస్థితులపై తహసీల్దార్‌కు వివరించారు. రాత్రి సమయాల్లో అత్యవసర సమయాల్లో ఆస్పత్రిలో వైద్యం అందించకుండా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యువకులు శివాజీ, రాజు, శంకర్, విష్ణు ఉన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా అంగన్‌వాడీ కేంద్రం

బీబీపేట : మండలంలో ఆకతాయిల అల్లర్లకు వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. రాత్రయిందంటే చాలు ఇష్టారాజ్యంగా వారి వికృతచేష్టలకు అంగన్‌వాడీ కేంద్రమే అడ్డాగా మారింది. బీబీపేట గ్రామ అమ్లెట్ గ్రామమైన రాంరెడ్డిపల్లిలో ఒకే ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అది గ్రామానికి కొంచం దూరంగా ఉండడంతో రాత్రయిందంటే చాలు మందు బాబులు అక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. సీసాలు అక్కడే పగలగొడుతున్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డట్లుగా స్థానిక సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతంలోనూ మందుబాబులు మద్యం సేవించి హంగామా చేసేవారిన అంగన్‌వాడీ టీచర్ లత తెలిపారు. రాత్రివేళ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తే వీరి అగడాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం



ఎన్నికైన అంబేడ్కర్ సంఘం కార్యవర్గం

బీబీపేట : మండలంలోని తుజల్‌పూర్ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తలారి కిరణ్, ఉపాధ్యక్షుడిగా దోనకంటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి, నీరడి వెంకటేష్, కార్యదర్శిగా పరదేశి నరేష్, కోశాధికారిగా అందె రమేష్ గౌడ్ ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

నేడు అవయవదానంపై అవగాహన సదస్సు

భిక్కనూరు : ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలో ఈనెల 13వ తేదీన మంగళవారం ఉదయం 11 గంటలకు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మర్రి మహిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దరామేశ్వర ట్రస్ట్, విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్, జాతీయ మానం హక్కుల కమిటీ ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థులకు బెల్ట్‌ల వితరణ

బీబీపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సిద్దిపేటకు చెందిన వీఎంఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వంగ మహేందర్ రెడ్డి రూ.15 వేల విలువచేసే బెల్టులు, ఐడీ కార్డులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామేశ్వర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలని హెడ్ కానిస్టేబుల్ సాయిలు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను చదువుకున్న పాఠశాలలకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. బహుమతులు అందజేసిన హెడ్ కానిస్టేబుల్ సాయిలును గ్రామస్తులు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్ను మాచారెడ్డి ఎస్సై అనిల్ సోమవారం పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన పొన్నాల నర్సింలుకు అప్పగించారు. ఐఈఆర్ ద్వారా ట్రేస్ చేసి అప్పగించామని ఎస్సై తెలిపారు.

మాజీ జెడ్పీటీసీ మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మాజీ జెడ్పీటీసీ కమ్మరి సుగుణమ్మ(75) సోమవారం సాయంత్రం అనారోగ్య కారణాలతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె జెడ్పీటీసీగా 2006 నుంచి 2011 వరకు కొనసాగారు. ఆమె మృతి పట్ల ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం అంత్యక్రియలు జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధిహామీ పనుల్లో ఇష్టారాజ్యం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధిహామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధి హామీ కూలీలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు కాటేపల్లి తదితర గ్రామల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ నిర్వహించి గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారికి మస్టర్‌లో కూలీలుగా చేర్చి హాజరువేయడం లాంటి అక్రమాలు చేశారని వారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.